సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



నృత్యం చేసిన చిన్నారులతో కలెక్టర్ దినేష్‌కుమార్

న్యూస్‌రీల్

సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌కు ఉత్తమ పురస్కారం

- లక్ష్యానికి మించి ఉత్పత్తి
- వెల్లడించిన జలవిద్యుత్ కేంద్రం ఈఈ రాజేంద్రప్రసాద్



అవార్డుతో సీలేరు జెన్‌కో ఉన్నతాధికారులు

సీలేరు: జల విద్యుత్ ఉత్పత్తిలో 2023–2024 సంవత్సరానికి సీలేరు కాంప్లెక్స్‌కు ఓవరాల్‌గా ఉత్తమ పురస్కారం లభించిందని జలవిద్యుత్ కేంద్రం ఈఈ రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులు ప్రదర్శించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాల్లో ఆర్థిక సంవత్సరంలో మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించింది. జలవిద్యుత్ రంగంలో సీలేరు కాంప్లెక్స్ 2,279 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యంలో 2,308 మిలియన్ యూనిట్లు సాధించిందన్నారు. అదనంగా 39 మిలియన్ యూనిట్లు సాధించి పురస్కారం దక్కించుకున్నట్టు అధికారులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల నుంచి ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీరు సమష్టి కృషి ఫలితమే ఈ పురస్కారమన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఏడీఈలు అప్పారావు, శ్రీధర్ కుమార్, సత్యనారాయణ, సుమన్, ఏఈఈ నాగబాబు, బాషా,విజిలెన్స్ సిబ్బంది సుధాకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా తగ్గని మంచు


- కొనసాగుతున్న చలి తీవ్రత



చిన్నగెడ్డ సమీపంలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నా మంచు తీవ్రత మాత్రం తగ్గడం లేదు. చలి ప్రభావం కొనసాగుతోంది. శనివారం జి.మాడుగులలో 9.8 డిగ్రీలు నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని గూడెంకొత్తవీధిలో 10.5 ,అరకువేలీలో 11.1, చింతపల్లిలో 11.5, డుంబ్రిగుడలో 12.3, హుకుంపేటలో 12.5, పాడేరులో 12.6, పెదబయలులో 13.3, ముంచంగిపుట్టులో 14.0, అనంతగిరిలో 14.5, కొయ్యూరులో 15.4 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు.


సంప్రదాయేతర పంటల సాగుకు మన్యం అనుకూలం



పంటలను పరిశీలిస్తున్న చింతపల్లి శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి, ఏవో మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: మన్యం వాతావరణం సంప్రదాయేతర పంటలసాగుకు అత్యంత అనుకూలమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని దామనాపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఏవో మధుసూదనరావుతో కలిసి పొద్దుతిరుగుడు, కొమ్ముశనగ పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పంటలకు నీటి సదుపాయం లేకపోయినా రబీ మంచి దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

లంబసింగికి పర్యాటకుల తాకిడి



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

చింతపల్లి: ప్రముఖ పర్యాటక కేంద్రం లంబసింగికి పర్యాటకుల తాకిడి నెలకొంది. శనివారం భారీగా తరలిరావడంతో రద్దీ నెలకొంది. లంబసింగి, తాజంగి జలాశయం ప్రాంతాల్లో కూడా సందడి వాతావరణం నెలకొంది. చెరువుల వేనం వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలు తిలకించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. **జి.మాడుగుల:** మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతానికి శనివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు.



సంగాలి నృత్యంతో అలరించిన ఆదివాసీ గిరిజన మహిళలు



ఆకట్టుకున్న పార్వతీపురం నందికొట్ట గిరిజనుల డ్యాన్స్



పద్మాపురం గిరిజన మ్యూజియంలో ఫ్లవర్ షో స్టాళ్లు



హెలీకాప్టర్‌లో విహారానికి కుటుంబ సభ్యులతో కలెక్టర్ దినేష్‌కుమార్



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పనశ్రీ, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

ఉత్సవ్ వేళ..
ఆనంద హేల

అరకు చలి ఉత్సవము 2025 ARAKU FESTIVAL

- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కిటకిటలాడిన సందర్శిత ప్రాంతాలు
- పుష్ప ప్రదర్శన వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి
- భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించిన అధికార యంత్రాంగం

అరకు చలి ఉత్సవ్ రెండో రోజు కూడా ఉత్సాహంగా సాగింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు, సందర్శకులు పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, హెలీరైడ్‌లో పాల్గొని ప్రకృతి అందాలను తనివితీరా వీక్షించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

అరకులోయ టౌన్/ డుంబ్రిగుడ: అరకు చలి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం నిర్వహించిన కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొదటి రోజు కన్నా జనం భారీగా తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం నిండిపోయింది. సందర్శిత ప్రాంతాలు కూడా కిటకిటలాడాయి. పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్‌కు విశేష స్పందన లభించింది. హెలీకాప్టర్‌లో విహరించి అరకు అందాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. హెలీరైడ్‌లో పాల్గొనే అవకాశం అందరికీ దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు.

పుష్ప ప్రదర్శనలో సెల్ఫీలు, ఫొటోలు..

అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. పూలతో రూపొందించిన నెమలి, ఏనుగు నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటి వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవ వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సందర్శించారు. రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. హెలీకాప్టర్‌లో విహరించి అరకు లోయ అందాలను తిలకించారు.

సైక్లింగ్‌లో అపశ్రుతి

ఉత్సవాల్లో భాగంగా బొర్రా నుంచి అరకులోయ వరకు నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విజయనగరానికి చెందిన అభిషేక్, ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే అభిషేక్‌ను 108 వాహనంలో అనంతగిరి ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

నాలుగు నిమిషాలకు రూ.4 వేలా..

చలి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన హెలీరైడ్‌కు రూ.4 వేలు తీసుకుని నాలుగు నిమిషాలు మాత్రమే తిప్పుతున్నారని పర్యాటకులు అసంతృప్తికి గురయ్యారు. కనీసం పది నిమిషాలైనా విహరించే అవకాశం కల్పిస్తే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు.

సమ్మర్ ఫెస్టివల్‌లో అందుబాటులో ఉండేలా..

హెలీ రైడ్‌కు జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఆదివారం కూడా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆమోదం వస్తే ఆదివారం కూడా హెలీరైడ్ అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలో నిర్వహించే సమ్మర్ ఫెస్టివల్‌లో హెలీరైడ్ అందరికీ అందుబాటులో ఉండేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ దినేష్ కుమార్ కుటుంబ సభ్యులతోపాటు 5కే రన్ మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన జీవనతన్య (7) కుటుంబంతో కలిసి హెలీకాప్టర్‌లో విహరించారు. ప్రకృతి అందాలను తిలకించారు. భవిష్యత్తులో విమానంలో విహరించాలని జీవనతన్య చెప్పిందని, ఈ మేరకు హెలీకాప్టర్‌లో విహారానికి ఆమె కుటుంబానికి అవకాశం కల్పించామన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చెక్క భజన బృందం, అరకు చొంపి గిరిజనుల థింసా నృత్యాలు, శ్రీకాకుళం తప్పెట గుళ్లు, పార్వతీపురం మన్యం జిల్లా నందికొట్ట ప్రదర్శన, డుంబ్రిగుడ బ్యాండ్‌మేళా, ప్రకాశం జిల్లా సంగాలి డ్యాన్స్, సూఫీ డాన్స్, మిశ్రం డాన్స్, జబర్దస్‌కళాకారుల కామిడీ స్కిట్, వందేమాతరం శ్రీనివాస్ సినీ గేయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పనశ్రీ దంపతులు, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ దంపతులు, విశాఖ జిల్లా జడ్జి ఎం.గిరిధర్ దంపతులు,మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు వీక్షించారు.

అరకులోయకు మరింత సొబగులు

- పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి
- కలెక్టర్ దినేష్‌కుమార్
- మాతృమూర్తి పేరిట మొక్క నాటి పార్కు నిర్మాణానికి శ్రీకారం



అమ్మపేరిట మొక్క ఫ్లకార్డుతో కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అరకు చలి ఉత్సవం రెండో రోజు శనివారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ నిశుదగల్ అని నామకరణం చేశారు. మాతృమూర్తి షణ్ముగవల్లి పేరిట మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందాల అరకులోయ పూల బొకేలను రాష్ట్రానికి పరిచయం చేస్తామన్నారు. పూల సాగుకు అరకు ప్రాంత వాతావరణం ఎంతో అనుకూలమన్నారు. పూల బొకేల తయారీలో అనుభవం ఉన్నవారిని తీసుకువచ్చి గిరిజనులకు శిక్షణ అందిస్తామన్నారు. బొర్రా గుహల నుంచి నుంచి డిగ్రీ కళాశాల మైదానం వరకు నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో 12 మంది పాల్గొన్నారని తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన టీపీ అగర్వాల్ (66) ప్రథమ స్థానం, అరకులోయ మండలం దండపాడుకు చెందిన పాంగి అజయ్ (13) ద్వితీయ స్థానం, విశాఖకు చెందిన ప్రియదర్శని తృతీయస్థానంలో నిలిచారన్నారు. వీరిలో అరకు ప్రాంతానికి చెందిన పాంగి అజయ్ సైకిలిస్ట్‌గా జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు. పాడేరు ఐటీడీఏ నుంచి అతనికి రైడ్ సైకిల్ అందజేస్తామని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా 2వ తేదీన సుంకరమెట్ట నుంచి గాలికొండ వ్యూ పాయింట్ వరకు ట్రెక్కింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఫ్యాషన్ షోతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ప్రముఖ ఫోక్ సింగర్ మంగ్లీ ఆలపించే గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. సైక్లింగ్ విజేతలకు బహుమతులు అందజేశారు. సబ్ డీఎఫ్‌వో ఉమా మహేశ్వరి, ఎంపీడీవో లవరాజు, డీఎల్పీవో పీఎస్ కుమార్, డీఈ రామం పాల్గొన్నారు.

తనివితీరా వీక్షించా



అరకు అందాలను తనివితీరా వీక్షించాం. ఈ ప్రాంతాన్ని ఎన్ని సార్లు సందర్శించినా కొత్తగానే కనిపిస్తుంది. ఈ ఏడాది నిర్వహించిన అరకు చలి ఉత్సవాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సందర్శకుల్లో ఉల్లాసం, ఉత్సాహం నింపాయి.

– ఎస్.మోనాలి, పర్యాటకురాలు, విశాఖపట్నం

రూ.4వేలు వసూలు సరికాదు



హెలీరైడ్‌కు రూ.4వేల చొప్పున సందర్శకుల నుంచి వసూలు చేయడం సరికాదు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు విమాన చార్జీ రూ.4 వేలు ఉంది. ఇక్కడ నాలుగు నిమిషాలు హెలికాప్టర్‌లో తిప్పి రూ.4 వేలు వసూలు చేయడం భారంగా ఉంది.

– దంగేటి నానాజీ, పర్యాటకుడు, మాడుగుల

మరుపురాని అనుభూతి



చాలాసార్లు విమానంలో విదేశాలకు వెళ్లాం. కానీ ఇలాంటి మంచి అనుభూతి ఎప్పుడూ పొందలేదు.హెలీకాప్టర్‌లో అరకు అందాలు తిలకించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇటువంటి అవకాశం కల్పించిన అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు.

– రాజమౌళి, జబర్దస్త్ కళాకారుడు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సంగాలి డ్యాన్స్



డుంబ్రిగుడ కళాకారుల బ్యాండ్ మేళా



పద్మాపురం ఉద్యానవనంలో పూల ప్రదర్శన, తిలకిస్తున్న పర్యాటకులు



పద్మాపురం ఉద్యానవనం వద్ద పర్యాటకుల సందడి

స్పీకర్ వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన

- హుకుంపేటలో ప్రజాసంఘాల ఆందోళన
- అయ్యన్నపాత్రుడు తక్షణం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, సీపీఎం, గిరిజన సంఘాల ప్రతినిధులు

హుకుంపేట: అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 1/70 చట్టం సవరణ చేయాలన్న వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసిన ప్రజాసంఘాలు ఆందోళన బాట పట్టాయి. దీనిలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి పెట్రోల్ బంకు నుంచి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు గిరిజన సంఘం, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల గిరిజన సంఘం నేత తాపుల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ గండేరు చినసత్యం 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్పీకర్ స్థానంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఆయన తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గిరిజన చట్టాల జోలికి వస్తే సహించమని స్పష్టంచేశారు. తప్పుడు వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడు గిరిజనులకు క్షమాపణ చెప్పాలని, అప్పటివరకు తగ్గేది లేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఎం.విశ్వేశ్వరరావు, నాయకులు తెడబారికి సురేష్‌కుమార్, తడిగిరి సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్, సీపీఎం నేతలు వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, రామారావు, కాంగ్రెస్ నేతలు చిన్నస్వామి, జానకిరావు, సాధు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భగవాన్

రంపచోడవరం: రంపచోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్నపరెడ్డి రవిరామ్ భగవాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమం శనివారం బార్ అసోసియేషన్ భవనంలో జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ధర్ముల లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా కొమ్మన శివరంజని, సహాయ కార్యదర్శిగా తుమ్మలపల్లి వెంకట్రావు, ట్రెజరర్‌గా భజన వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.



లక్ష్మీనారాయణ



భగవాన్

58 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు
- వీరిలో ఒకరు బాలుడు



నిందితుడితో సీఐ వరప్రసాద్, సిబ్బంది

గూడెంకొత్తవీధి: ఒడిశానుంచి కారులో గంజాయి తరలిస్తూ గూడెం కొత్తవీధి వద్ద పోలీసులకు ఇద్దరు పట్టుబడ్డారు. సీఐ వరప్రసాద్ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీలేరుకు చెందిన ఇద్దరు కారులో గంజాయి తరలిస్తుండగా శుక్రవారం సాయంత్రం సిబ్బంది చేపట్టిన వాహన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. వారి నుంచి 58 కిలోల స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని తరలిస్తున్న వారిలో ఒకరు సీలేరుకు చెందిన పెదపూడి చినబాబు మరొకరు బాలుడు ఉన్నారన్నారు. వీరు ఒడిశాలోని రాజ్‌బేడాక్ అనే గ్రామంలో కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్ ఫోన్లు, కారు, రూ.320 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకరు బాల నేరస్తుడు కావడంతో అతనిని జువైనల్ హోమ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీలకు అన్యాయం

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ ఆవేదన



పాడేరు రూరల్: ఆదివాసీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ అంటూ ప్రచార్భాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను మరింత దిగజార్చేలా బడ్జెట్ కేటాయింపు చేసిందన్నారు. బడ్జెట్‌లో దేశ ఆదివాసీ జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా 8.8 శాతం నిధులు కేటయించాలన్నారు. ఆదివాసీ సబ్ ప్లాన్ రూ.3,54,574 కోట్లకు కేవలం రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటయించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఆదివాసీల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్, బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. ఆదివాసీల విద్యారంగానికి గత ఏడాది రూ. 240 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 2కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌కు గత ఏడాదిలో రూ.440 కోట్లు కేటయించగా ఈ ఏడాది రూ.313 కోట్లు కేటయించిందన్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా విద్యారంగాలకు కేటయించే బడ్జెట్ మొక్కుబడిగా ఉందన్నారు. ఇకనైనా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

చింతూరు: లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆరో తరగతిలో ప్రవేశానికి బాలురకు 30 సీట్లు, బాలికలకు 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈనెల 19 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఫీజు పోరుబాటకు సిద్ధం

- అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం పిలుపు



ఫీజు పోరుబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5న తలపెట్టిన ఫీజు పోరుబాటకు సిద్ధం కావాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు అరకులోయలోని క్యాంపు కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి రూ.3900 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. 5న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయనున్నామని, ముందుగా ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తక్షణమే తమ వైఖరి మార్చుకుని విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఫీజు పోరులో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పి.చిన్నారావు, ఎంపీటీసీ ఆనంద్, పార్టీ నాయకులు కమ్మిడి అశోక్, నరసింహమూర్తి, అర్జున్, నరసింగరావు, పాల్గొన్నారు.

కుటుంబ పోషణకు ఉన్నత ఉద్యోగం తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ప్రశాంత్

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువత కోసం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రేరణ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్ కోరారు. రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం పోలీస్, ఇన్నోవ్‌సోర్స్ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన రంపచోడవరం ప్రాంతానికి చెందిన గిరిజన యువత శిక్షణ కోసం వెళ్లలేదన్నారు. ఇందుకు కారణాలు తెలుసుకున్నామన్నారు. ఇంటిని, స్నేహితులను వదిలి వెళ్లలేక ఇక్కడే ఏదో పని చేసుకుందామన్న ధోరణిలో ఉన్నారని తెలిపారు. బ్యాచ్‌లర్‌గా ఎంత వచ్చిన సరిపోతుందని, అదే కుటుంబ పోషణకు ఉన్నత ఉద్యోగం చేయడం తప్పనిసరి చెప్పారు. జాబ్‌మేళాకు 387 మంది హాజరు కాగా.. 300 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. ఎంపికైన వారి జాబితాను రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, మహిళలకు ఆశాజనకంగా..



ఎంఎస్‌ఎంఈ రంగానికి చేయూతనిస్తూ, ఎగుమతుల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యతనివ్వడం ప్రశంసనీయం. క్రెడిట్ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, స్టార్టప్‌లకు రూ.10 కోట్లకు పెంచడంతో పాటు వృద్ధిలో ఉన్న ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారులకు టర్మ్ లోన్ రూ.20 కోట్లకు పెంచడంతో ఈ రంగాలకు పెట్టుబడి, వర్కింగ్ క్యాపిటల్ బలోపేతమవుతాయి. యువతను సన్నద్ధం చేసేలా 5 నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు అభినందనీయం. బడ్జెట్ ప్రతిపాదనలో గ్లోబల్ స్కిల్లింగ్ భాగస్వామ్యాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏఐ ఏర్పాటు ఉండటం నిరుద్యోగులు, మహిళలలో నైపుణ్యాన్ని పెంచుతుంది.

– కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ ప్రెసిడెంట్

రెండు దశాబ్దాల తర్వాత గణనీయమైన సవరణ



దాదాపు 20 ఏళ్లలో మొదటిసారిగా వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబ్‌లలో గణనీయమైన సవరణను సూచించారు. ఈ నిర్ణయంతో ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైందిగా నిలిచిపోతుంది. ఇది మధ్య తరగతికి ఒక పెద్ద ప్రోత్సాహకం. ఈ పన్ను ఆదా ప్రజలు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడంలో సహాయ పడటమే కాకుండా ఎక్కువ ఆర్థిక సౌలభ్యాన్ని కూడా ఇస్తుంది. వ్యవసాయ రంగానికి అనేక ప్రగతిశీల కార్యక్రమాలు ప్రవేశపెట్టడం ప్రశంసనీయం.

–సుధీర్ ములగాడ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈసీ సభ్యుడు

మధ్యతరగతి,గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం



బడ్జెట్ మధ్య తరగతి, గ్రామీణాభివృద్ధికి గణనీయమైన ప్రయోజనాలను అందించనుంది. జీడీపీ వృద్ధికి దోహదపడుతోంది, వ్యవసాయ రంగంలో సంస్కరణలు కాలక్రమేణా స్థిరమైన ప్రయోజనాలను అందించనున్నాయి. బీమా రంగంలో ఎఫ్‌డీఐని 100శాతానికి పెంచడం వల్ల మరిన్ని విదేశీ కంపెనీలను ఆకర్షించే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు బీమా సౌకర్యం మరింత అందుబాటులోకి రానుంది.

–పైడా కృష్ణప్రసాద్, పారిశ్రామిక రంగ నిపుణుడు



విద్యకు పెరగని కేటాయింపులు



కేంద్రంలో ఎన్ని బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా.. విద్యా రంగానికి కేటాయింపులు పెరగడం లేదు. ఈ సారి కూడా విద్యకు 2.5 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయం. కొఠారి కమిషన్ సూచనల ప్రకారం కనీసం 6 శాతం నిధులు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంది. రానున్న ఐదేళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పిన వ్యటికీ.. అందుకు సంబంధించి సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనపై స్పష్టం ఇవ్వలేదు.

– ఏఎస్ నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏపీటీఎఫ్–1938

ఆశ నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి

- మెట్రో ఊసే లేదు.. 'జోన్' కూత వినిపించలేదు
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపు
- ప్యాకేజీ నిధుల్లో భాగంగానే కొంత విదిలింపు
- అన్ని పోర్టులతో పాటు వైజాగ్ పోర్టుకు రూ.730 కోట్లు
- షిప్‌యార్డుకు రూ.150 కోట్లు
- ఇవి మినహా.. పద్దులో విశాఖ ప్రస్తావన శూన్యం
- ఆదాయపు పన్ను వర్గాలకు కాసింత ఊరట

సాక్షి, విశాఖపట్నం: కర్షక, పారిశ్రామిక, మధ్య తరగతి వర్గాలను కాస్తా ఊరడించేలా.. పద్దు లెక్కలు చదివిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. విశాఖను మాత్రం పూర్తిగా విస్మరించారు. డీపీఆర్ ఇచ్చినా.. వైజాగ్ మెట్రో ఊసే లేదు.. రైల్వే జోన్ ప్రస్తావన లేదు.. అంతెందుకు విశాఖ పేరు కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం జిల్లా ప్రజల్నే విస్మయానికి గురిచేసింది. కేవలం ఉద్యోగుల్ని ఊరడిస్తూ.. పన్ను చెల్లింపుదారుల్ని పలకరిస్తూ.. రైతులకు భరోసా ఇస్తూ.. యువతకు నైపుణ్యం అందించేలా చెయ్యందిస్తూ.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ.. సాగిన సుదీర్ఘ ప్రసంగం వల్ల విశాఖకు ఒనగూరిన ప్రయోజనాలేవీ కనిపించలేదంటూ ప్రతి ఒక్కరూ పెదవి విరుస్తున్నారు. అయితే స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు, హిందూస్థాన్ షిప్‌యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం రూ.150 కోట్లు కేటాయించారు. దేశంలోని మేజర్ పోర్టులకు కేటాయించిన మాదిరిగానే విశాఖ పోర్టు అథారిటీకి రూ.730 కోట్లు విదిలించారు.

ఎంఎస్‌ఎంఈలకు చేయూతనందించేలా..



వినియోగ ఆధారిత వృద్ధి, సులభతర వ్యాపారం, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈలు, ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించినట్లు బడ్జెట్‌లో స్పష్టమవుతోంది. 49 శాతం ప్రభుత్వ సహకారంతో రూ.25,000 కోట్ల సముద్ర అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయడం అద్భుతమనే చెప్పొచ్చు. ఎంఎస్‌ఎంఈలకు చేయూతనందించేలా పెట్టుబడి, టర్నోవర్ పరిమితులను వరుసగా 2.5, 2 రెట్లు పెంచడం చూస్తే.. అనేక ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉంది.

– శ్రీనాథ్ చిట్టూరి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జోన్ చైర్మన్

వాల్తేరు డివిజన్ కొనసాగింపు లేదు

విశాఖ రైల్వే జోన్‌కు దాదాపు నెల రోజుల క్రితం ప్రధాని మోదీ వైజాగ్ వచ్చి మరీ శంకుస్థాపన చేశారు. కానీ.. బడ్జెట్‌లో జోన్ పనులకు సంబంధించిన ప్రస్తావనే తీసుకురాలేదు. వాల్తేరు డివిజన్ కొనసాగింపు గురించి కూడా అతీగతి లేదన్నది బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైంది. జోన్ ప్రకటించి ఐదున్నరేళ్లు గడిచినా.. ఆచరణలో మాత్రం అడుగు పడేందుకు ఇంకొంత సమయం వేచి ఉండాల్సిందేనని కేంద్ర మంత్రి సీతారామన్ చెప్పకనే చెప్పేశారు.

మెట్రో గాలికేనా.?

విశాఖ నగరానికి మెట్రో కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ని 2024 జనవరిలో కేంద్రానికి పంపించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త డీపీఆర్‌ని కూడా సిద్ధం చేసేసింది. మెట్రో రైలు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా విదిలించకపోవడం అందర్నీ ఆగ్రహానికి గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుపై ముందు కెళ్తున్నామని చెబుతున్నా.. కేంద్రంపై మాత్రం ఒత్తిడి తీసుకురాలేదని బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైందని అన్ని వర్గాలూ పెదవి విరుస్తున్నాయి.

ఎంఎస్‌ఎంఈలకు చేయూత

ఎంఎస్‌ఎంఈలపై బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. ఎంఎస్‌ఎంఈ రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు పెంచారు. తయారీ రంగంలో 36 శాతం వాటా ఉన్న ఎంఎస్‌ఎంఈలకు ఈ రుణ పరిమితి పెంపు పెద్ద ఊరటనిచ్చే అంశమని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 4450 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఉండగా 14,639 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇందులో దాదాపు 70 శాతం ఎంఎస్‌ఎంఈలు లబ్ధి పొందే అవకాశాలున్నాయి. గతంలో రూ.కోటి వరకూ ఆడిట్ లేకుండా ఉండగా.. ఇప్పుడు రూ.5 కోట్ల వరకూ ఆడిట్ లేకుండా చేయడంతో మధ్య తరహా పరిశ్రమలు స్వల్పంగా లాభపడతాయి.

ఉక్కు కేటాయింపులు.. ఆ నిధుల్లో భాగమే.?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే ఈ కేటాయింపులు ఏ ప్రాతిపదికన ఇస్తున్నారనే దానిపై అందరిలోనూ సందిగ్ధం నెలకొంది. ఇటీవల ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిధుల్లో భాగమే ఈ కేటాయింపులు చేశారే తప్ప.. కొత్త కేటాయింపులు కాదని స్టీల్‌ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే తొలివిడత కింద కొద్ది నెలల క్రితం రూ.1640 కోట్లు ఇవ్వగా.. తాజాగా శుక్రవారం రాత్రి మరో రూ.6,783 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడు మరో రూ.3,295 కోట్లు కేటాయింపులు చేశారు. ఇవి ఈ ఆర్థిక సంవత్సరం లోపు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నిధులతో ప్లాంట్ ఎలా ముందుకు దూసుకెళ్లగలదని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

తూనికల్లో తేడాలుంటే చర్యలు

- ఆ శాఖ డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్
- ముంచంగిపుట్టు వారపు సంతలో ఆకస్మిక తనిఖీలు



వ్యాపారిపై కేసు నమోదు చేస్తున్న తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్

ముంచంగిపుట్టు: తూనికల్లో తేడాలుంటే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా తూనికలు,కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో తూనికలు, కొలతల జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సంతలో తూనిక కాటాలను పరిశీలించారు. ముగ్గురు వ్యాపారుల కాటాల్లో తూకంలో తేడాను గుర్తించారు. పది కిలోల తూకపు రాయి 9 కిలోల చూపించడంతో వారిపై కేసు నమోదు చేశారు. తూనిక రాళ్లు, కాటాలకు సీళ్లు లేకపోవడంతో గుర్తించిన వారు వ్యాపారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్ మాట్లాడుతూ వ్యాపారులు తూనికల్లో ఎటువంటి మోసాలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువుల బరువులను సరి చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, విశాఖపట్నం జిల్లా పరిశీలకులు వి.రామారావు,సిబ్బంది పాల్గొన్నారు.

'ఏజెన్సీలో విధులు మరువలేను'



మేజిస్ట్రేట్ జాన్‌రాజ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలో పని చేసి గిరిజనులకు సేవ చేయడంలో ఎంతో ఆనందంగా ఉందని, మంచి సేవలు అందిస్తే ఏ అధికారికైనా గుర్తింపు ఉంటుందని రంపచోడవరం మొబైల్ కోర్టు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఈ.జాన్‌రాజ్ అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన మేజిస్ట్రేట్‌ను శనివారం న్యాయవాదులు, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో డీఎన్‌వీ రమణ, న్యాయవాదులు ఎంవీఆర్ ప్రకాష్, కోలా సత్యప్రసాద్, భగవాన్, చుక్కా సంతోష్‌కుమార్, కొమ్మిశెట్టి బాలకృష్ణ, భజన వెంకటేశ్వర్లు, శివరంజని, జిలానీ పాల్గొన్నారు.

ఏకలవ్యలో ప్రవేశాల దరఖాస్తుకు 19 వరకు గడువు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భూరామ్ భైరవ తెలిపారు. ఫిబ్రవరి 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌సీఈటీ.ఏపీసీ సీఈటీ ఎఫ్ఎస్ఎస్.ఇన్, ఏపీటీడబ్ల్యూగురుకులమ్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 9571424956, 6304101706 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- గాయపడిన స్నేహితుడిని పరామర్శించి వస్తుండగా ఘటన
- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- కన్నాపురంలో తీవ్ర విషాదం



మృతదేహాల వద్ద భోరున విలపిస్తున్న బంధువులు

ఎటపాక: మరణంలోనూ వారి స్నేహం వీడలేదు. గాయపడిన ప్రాణ స్నేహితుడిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా మరో ఇద్దరు స్నేహితులు కానరాని లోకానికి వెళ్లిపోయారు. శుక్రవారం రాత్రి లారీ రూపంలో మృత్యువు వారిని కబళించింది. ఎటపాక స్టేషన్ సీఐ కన్నపరాజు, ఎస్‌ఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ కన్నాపురం గ్రామంలో శుక్రవారం ఓ శుభకార్యం జరిగింది. ఆ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు కారం సీతారామయ్య, పొడియం రాజారావు, కుర్సం భద్రయ్య ఎంతో సరదాగా గడిపారు. అనుకోనిరీతిలో కింద పడిన సీతారామయ్య కాలికి గాయం కావడంతో బంధువులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుభకార్యం ముగిసిన వెంటనే తమ స్నేహితుడిని పరామర్శించేందుకు రాజారావు(31), భద్రయ్య(41) ద్విచక్ర వాహనంపై భద్రాచలం వెళ్లారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో వారు ఇంటికి తిరిగి వస్తుండగా చింతూరు వైపు నుంచి ఐరన్ లోడుతో భద్రాచలం వెళ్తున్న లారీ చోడవరం పంచాయతీ పరిధి భీమవరం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్నేహితులిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన కోసం వచ్చిన ఇద్దరు మిత్రులు ప్రమాదంలో శవాలుగా మారి తన గది పక్కనే ఉన్న మార్చురీలో ఉన్నారని తెలిసిన సీతారామయ్య భోరున విలపించాడు. మృతుల బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మిన్నంటింది. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను ఎటపాక స్టేషన్‌కు తరలించి సీఐ కన్నపరాజు, ఎస్‌ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజారావుకు భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భద్రయ్యకు భార్య సాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ రెండు కుటుంబాల సభ్యులు భోరున విలపిస్తున్నారు.



పొడియం రాజారావు, కుర్సం భద్రయ్య(ఫైల్)

సబ్బవరంలో భారీగా గంజాయి పట్టివేత

224 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్.సిఐ పిన్నింటి రమణ తదితరులు

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద రూ.11.20 లక్షల విలువ చేసే 224 కిలోల గంజాయిని శనివారం సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. సీఐ పిన్నింటి రమణ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సింహాచలం, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణు స్వరూప్, సీఐ పిన్నింటి రమణతో కలిసి ఈ కేసు వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద ఎస్‌ఐ సింహాచలం, సిబ్బందితో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న వ్యానును ఆపి తనిఖీ చేయగా, ఐరన్ లోడ్ కింద 108 గంజాయి ప్యాకెట్లు ఉంచి, టార్పాలిన్ కప్పి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దాదాపు 224 కిలోల గంజాయిని వాహనంలో ఉన్న ఐదుగురు వ్యక్తులు ఆనందపురంలో లోడ్ చేసి.. మహారాష్ట్రలోని కోల్హాపూర్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారి వద్ద నుంచి రూ. 39.62 లక్షల విలువ చేసే గంజాయి, వ్యాన్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగులకు చెందిన డి.రమణమూర్తి, దుర్గా బాలరాజు, మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన అనిల్ సురేష్, కొలాలంపూర్‌కు చెందిన రాహుల్ రాకేష్, సుమిత్, అమిత్ బాటింగ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో 6వ నిందితుడు, వ్యాన్ యజమాని సరజీరావ్ గైక్వాడ్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గంజాయిని పట్టుకున్న సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐ సింహచలం, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

58 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 58 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తన సిబ్బందితో శనివారం స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ప్రసన్ రాజ్, కిశోర్ బలియర్ సింగ్, రాహుల్ పని, పింటు దాస్ వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.2.9 లక్షలు విలువైన 58 కిలోల గంజాయిని సీజ్ చేశారు. విశాఖపట్నం మీదుగా ముంబయికి గంజాయి రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.